

భూపాలపల్లి సభా స్థలిలో సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు



ములుగు తంగేడు మైదానంలో ఏర్పాటు చేసిన వేదికను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి, నేతలు

# ములుగు, భూపాలపల్లికి జననేత

- నేడు రెండు నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలు
- హాజరుకానున్న బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్
- సభా స్థలాలను పరిశీలించిన ఎమ్మెల్యే గండ్ర, ఎమ్మెల్సీలు పోచంపల్లి, సారయ్య
- భద్రత కట్టుదిట్టం చేసిన పోలీసులు
- పకడ్బందీగా పార్కింగ్ స్థలాలు
- లక్షలాదిగా తరలిరానున్న ప్రజలు, అభిమానులు, బీఆర్‌ఎస్ శ్రేణులు
- గులాబీమయమైన రెండు నియోజకవర్గాలు



భూపాలపల్లిలో సిద్ధమైన ప్రజా ఆశీర్వాద సభా వేదిక

ములుగు/ జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాల్లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్నారు. మొదట మధ్యాహ్నం 3 గంటలకు ములుగు జిల్లా కేంద్రంలోని బండారుపల్లి రోడ్డు పక్కన తంగేడు మైదానంలో అభ్యర్థి బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు కేసీఆర్ హాజరవుతారు. ఆయన ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో ములుగుకు చేరుకోనున్నారు. లక్ష మంది హాజరయ్యే సభకు బీఆర్‌ఎస్ శ్రేణులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని 2 మండలాల నుంచి ప్రజలు తరలిరానున్నారు. మండలానికి 10వేల మంది చొప్పున తరలించి జిల్లా కేంద్రం నుంచి అత్యధికంగా ప్రజలను తరలించే నేతలు ప్లాన్ చేశారు. సభా ప్రాంగణానికి 500 మీటర్ల దూరంలో ప్రత్యేక హెలిప్యాడ్‌ను తయారు చేశారు. సభకు వచ్చే ప్రజల కోసం లక్ష కుర్చీలతో పాటు సౌకర్యాలు కల్పిస్తున్నారు. గురువారం ఉదయం ఎస్పీ గౌష్‌ఆలం ఏర్పాట్లను పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. సాయంత్రం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, మండలాల ఇన్‌చార్జిలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఏరువ సతీశ్‌రెడ్డి, సాంబారి సమ్మారావు, మెట్టు శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**భూపాలపల్లి నియోజకవర్గంలో..**

బీఆర్‌ఎస్ జయశంకర్ జిల్లా కార్యాలయం వెనక ఏర్పాటు చేస్తున్న ప్రజా ఆశీర్వాద సభకు వేదికను సిద్ధం చేశారు. సుమారు లక్ష మందికి సరిపడేలా ఏర్పాట్లు చేశారు. నేడు సాయంత్రం 4గంటలకు మంజూర్‌నగర్‌లోని కలెక్టరేట్ వద్ద గల హెలిప్యాడ్ వద్దకు సీఎం కేసీఆర్ చేరుకుంటారు. అక్కడి నుంచి కారులో సభా స్థలికి చేరుకుంటారు. ఈ సందర్భంగా సభా స్థలి, హెలిప్యాడ్‌ను ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య గురువారం పరిశీలించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంకు ఎదురుగా ఉన్న స్థలంతో పాటు సన్‌వ్యాలీ పాఠశాల సమీపంలో, సభా స్థలికి సమీపంలో సింగరేణి ఇసుక నిల్వ చేసే ఖాళీ స్థలాలను పార్కింగ్ కోసం పోలీసులు కేటాయించారు. ఎస్పీ కిరణ్‌ప్రభాకర్ ఖారె, భూపాలపల్లి డీఎస్పీ రాములు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్ నుంచి ప్రత్యేక పారా మిలటరీ పోలీస్ బలగాలు ఇప్పటికే భూపాలపల్లికి చేరుకున్నాయి. డీఎస్పీ రాములు పోలీసులకు విధులు కేటాయించారు. ఎమ్మెల్యే గండ్ర, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, నియోజకవర్గ ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య పార్టీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం నుంచి 10వేల మందిని సమీకరించాలని ఆయా మండలాల ఇన్‌చార్జిలను ఆదేశించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులతో పాటు పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు ఆయా వార్డుల నుంచి 30వేల మందిని సమీకరించాలని ఎమ్మెల్యే కోరారు. మొత్తం లక్ష మందితో సభ నిర్వహించేందుకు ప్లాన్ చేశారు. ఈ మేరకు పార్టీ శ్రేణులు జనసమీకరణలో నిమగ్నమయ్యారు. సింగరేణి కార్మికులు, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు డ్యూటీ డ్రెస్‌తో పాటు తట్టా, చెమ్మాస్, టోపీతో సభకు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్నారు. కేసీఆర్ సభ నేపథ్యంలో పట్టణంలో భారీగా ఫ్లెక్సీలు, గులాబీ తోరణాలు వెలిశాయి.



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

## ఏజెన్సీని అభివృద్ధి చేసి చూపిస్తా

- కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే శ్రీరామరక్ష
- భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం, నవంబర్ 23 : ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏజెన్సీ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని భద్రాచలం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం మండలంలోని అచ్యుతాపురం, మహదేవపురం, వర్క్‌షాప్ గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. మహదేవపురంలో కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన 50 కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరగా తెల్లం పార్టీలోకి ఆహ్వానించారు. స్థానికుడినైన తనను ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరిత అభివృద్ధి చేస్తానన్నారు. సీఎం కేసీఆర్ పాలన తన గెలుపునకు శ్రీరామరక్షగా నిలిచిందన్నారు. ఎన్నికల్లో తనకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, కార్యదర్శి కణితి రాముడు, అధికార ప్రతినిధి ఎండీ జానీపాషా, సర్పంచులు మట్టా వెంకటేశ్వర్‌రావు, జ్యోతి, దామెర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే అభ్యర్థి వెంకట్రావు

## సీఎం కేసీఆర్‌తోనే ప్రగతి పరుగులు

- కాంగ్రెస్‌కు ఓటేస్తే ఏం జరిగిందో ఆలోచన చేయండి
- పదవి లేకపోయినా ఈ ఐదేళ్లు మీతోనే ఉన్నా..
- బీసీ బిడ్డగా నాకు ఎమ్మెల్యేగా అవకాశమివ్వండి
- బీఆర్‌ఎస్ మంథని అభ్యర్థి పుట్ట మధూకర్

కాటారం, నవంబర్ 23 : సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని మంథని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి, మద్దులపల్లి, ఆదివారంపేట, గుమ్మళ్లపల్లి గ్రామాల్లో గురువారం రాత్రి భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణితో కలిసి ఆయన ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు మధుకు నీరాజనాలు పలికారు. పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా, కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ కావాలో.. మీ కన్నీరు తుడిచే పుట్ట మధు కావాలో ఆలోచించుకోవాలన్నారు. మీరు పదవి ఇయ్యకపోయినీ మీ మధ్యే బతికిన, మీ ఓట్లతో గెలిచిన వ్యక్తి తన కుటుంబాన్ని పట్టించుకున్నాడే గానీ.. మిమ్మల్ని ఏనాడైనా పట్టించుకున్నాడా అని అన్నారు. బీసీ బిడ్డగా తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అరాచకాలు పెట్రేగి పోతాయని, అందుకు మహాముత్తారం మండలం మీనాజిపేట గ్రామంలో జరిగిన దాడులే నిదర్శనమన్నారు. కరెంటు కావాలో...కాంగ్రెస్ కావాలో మీరే వేసే ఓటు పైనే ఆధారపడి ఉంటుందన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

ఒక్కసారి అవకాశం ఇచ్చినందుకే నాలుగేండ్లలో నియోజకవర్గంలో ప్రతి ఊరుకు రోడ్లు వేయించడంతోపాటు ప్రతి బడిలో మౌలిక వసతులు కల్పించానని, సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరువ చేశానని తెలిపారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో తెలంగాణ ప్రజల దశ, దిశను మారుస్తుందన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.3వేల జీవన భృతి, రూ.400లకే వంట గ్యాస్, రూ.15లక్షల వరకు ఆరోగ్యశ్రీ పెంపు, తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి సన్న బియ్యం, ఇవన్నీ అమలు కావాలంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో రావాలన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో మంథని ఎమ్మెల్యేగా నన్ను మీ బిడ్డగా ఆశీర్వదించి ఆదరించి గెలిపించాలని కోరారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత జక్కు రాకేశ్, పార్టీ మండల అధ్యక్షుడు తోట జనార్దన్, యూత్ అధ్యక్షుడు రామిల్ల కిరణ్, మహిళా అధ్యక్షురాలు రత్న సౌజన్యా రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు కుడుదుల రాజబాబు, ప్రధాన కార్యదర్శి జోడు శ్రీనివాస్, రామచంద్రం, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు భూపెల్లి రాజు, నాయకులు మందల లక్ష్మారెడ్డి, దుర్గం తిరుపతి, పంతకాని సడువలి, కుమ్మరి అశోక్, రాజేంద్రాచారి, రమేశ్ బాబు, సంతోషం శ్రీనివాస రెడ్డి, జక్కు శ్రావణ్, బొడ్డు రాజబాబు, నరివెద్ది శ్రీనివాస్, శంకరయ్య, దబ్బెట రాజేశ్, దుర్గారావు, శకుంతల, శ్రీలక్ష్మీచౌదరి, మమత, తిరుపతి, వీరగోని కిరణ్, తోమర్ల వెంకటరమణ పాల్గొన్నారు.